## సాధారణ కాలం – 3వ ఆదివారం (సంవత్సరం A) – 25.01.2026

## యెషయా 8:23–9:3; 1 కోరింథీయులు 1:10–13, 17; మత్తయి 4:12–23

## “క్రీస్తు పిలుపు: అంధకారంనుండి వెలుగులోకి—కలిసి అడుగుపెట్టడం”

### పరిచయం (INTRODUCTION)

చాలా సంవత్సరాల క్రితం, ఒక యువ సర్కస్ బాలుడు తన జీవితంలో అతి గొప్ప విన్యాసానికి సిద్ధమయ్యాడు. నెలల తరబడి అతను శిక్షణ పొందాడు. కానీ ప్రదర్శన జరిగే రోజున భయం అతన్ని పూర్తిగా పట్టేసింది. ఊయల వదిలిన క్షణంలోనే, ముందున్న కడ్డీని తాను చేరలేనని అతనికి తెలిసిపోయింది. ప్రేక్షకులంతా ఉలిక్కిపడ్డారు.
కానీ అతని కింద ఒక వల ఉంది—బలమైనది, స్థిరమైనది, సిద్ధంగా ఉన్నది. అది అతన్ని పట్టుకుంది. అది అతన్ని కాపాడింది.

ఈ రోజు సువార్తలో, యేసు మత్స్యకారులను ఒక విన్యాసం తీసుకోవాలని పిలుస్తాడు—పడవలను, వలలను, అలవాటైన రోజువారీ జీవితాన్ని వదిలి పెట్టమని. వారు తెలియని మార్గంలోకి అడుగుపెడతారు. దేవుని వల—అంటే ఆయన సాన్నిధ్యం, ఆయన మార్గదర్శనం, ఆయన ప్రేమ—తమను నిలబెడుతుందనే విశ్వాసంతో ముందుకు సాగడం.

ఈ రోజు కూడా ప్రభువు మన ముందే నిలబడి ఉన్నాడు. మనలను తన వెలుగును అనుసరించమని, మన జీవితాలకు అంటిపెట్టుకున్న అంధకారాన్ని వదిలి పెట్టమని, ఆయన కృప అనే రక్షణ వలపై సంపూర్ణంగా నమ్మకం ఉంచమని ఆహ్వానిస్తున్నాడు.
ఇప్పుడు ఆయన పిలుపును వినేందుకు మన హృదయాలను సిద్ధం చేసుకుందాం.

*— కొద్ది సేపు మౌనం —*

## ప్రసంగం (HOMILY) : "వెలుగును అనుసరించడం – కలిసి ప్రయాణించే పిలుపు"

కొన్ని సంవత్సరాల క్రితం, నేను ఒక యువ సర్కస్ బాలుడి కథను చదివాను. అతను తరతరాలుగా సర్కస్ కళాకారులుగా ఉన్న కుటుంబానికి చెందినవాడు. అతని పూర్వీకుల్లాగే ఊయల ఊగే కళాకారుడిగా మారాలని అతని కోరిక. చిన్న వయస్సు నుంచే, అతని తండ్రి అతన్ని ఊయల మీదకు తీసుకెళ్లి, అతని పెద్ద అన్నయ్య చేతులు పట్టుకుని సురక్షితంగా ఊగడం నేర్పాడు.

కానీ అతని మొదటి ఒంటరి శిక్షణ రోజున, అతని కళ్లకు గంతలు కట్టారు. ఎలాంటి భద్రతా పట్టీ లేదు. ఎదురుగా అతన్ని పట్టుకోవడానికి అతని అన్నయ్య మాత్రమే ఉన్నాడు. అతను దూకాడు. కానీ సగం దూరమే చేరాడు. ప్రేక్షకులందరినీ భయం కమ్మేసింది. అతను పడిపోయేవాడే. కానీ ఆఖరి క్షణంలో, అతని తండ్రి కింద భద్రతా వలను విస్తరించాడు. ఆ బాలుడు రక్షించబడ్డాడు.

మన మానవ జీవితం కూడా ఆ దూకుడులాంటిదే. మనం ప్రమాదాలు తీసుకుంటాం, తెలియని భవిష్యత్తులోకి అడుగుపెడతాం, కొన్నిసార్లు పడిపోతున్నామనే భావన కలుగుతుంది. కానీ దేవుడు తన దివ్య నిర్వహణలో మనకు ఒక వలను సిద్ధం చేశాడు—యేసు క్రీస్తు ద్వారా, అలాగే సంఘం ద్వారా. మనం తడబడినప్పుడు, అది మనల్ని పట్టుకుంటుంది, మనల్ని నిలబెడుతుంది.

### 1. కలిసి ప్రయాణించడం

"నేను ఎలా ప్రారంభించాలి?" అనే ప్రశ్న మనందరికీ జీవితంలో ఎన్నో సందర్భాల్లో వస్తుంది. ఏదైనా ప్రారంభించడం చాలా ముఖ్యమైన విషయం. తప్పు ఆరంభం మొత్తం ప్రయాణాన్ని కష్టతరం చేయవచ్చు, కొన్నిసార్లు అసాధ్యంగా కూడా మార్చవచ్చు. గత సంవత్సరం తీసుకున్న ఒక నిర్ణయం ఉన్నఫలంగా విఫలం కావచ్చు లేక రద్దు కావచ్చు అనే విషయాన్ని గుర్తు చేసుకోండి. ఆలోచన లేకుండా చేసిన ఆరంభం అన్నింటినీ గందరగోళం చేస్తుంది. ఎవరో అన్నట్లు: "ఆరంభమే మనల్ని ముందుకు నడిపిస్తుంది."

ఈ రోజు సువార్తలో, యేసు తన ప్రేషిత సేవ ప్రారంభ దశలో ఉన్నాడు. ఆయన అధికార కేంద్రాల్లో కాదు, గలిలేయాలో—సాధారణ ప్రజల మధ్య—తన కార్యాన్ని మొదలుపెడతాడు. జీవితం ఏంటో తెలిసిన మత్స్యకారులను ఆయన పిలుస్తాడు. వారు జీవితం యొక్క ఆనందాలు, కష్టాలు, భారాలు అన్నీ అనుభవించినవారు.

రెండవ వాటికన్ మహాసభ ఎంతో అందంగా ఇలా చెప్పింది:
"ఈ కాలంలోని మనుషుల ఆనందాలు, ఆశలు, దుఃఖాలు, భయాలు—క్రీస్తు శిష్యుల ఆనందాలు, ఆశలు, దుఃఖాలు, భయాలే. నిజంగా మానవమైనదేదీ వారి హృదయాల్లో ప్రతిధ్వనించకుండా ఉండదు."

యేసు శిష్య బృందంగా పని చేయగల వారిని ఎంచుకుంటాడు. మత్స్యకార పని

ఎప్పుడూ ఒంటరిగా చేయలేము; అది సహకారంతోనే జరుగుతుంది. అలాగే ఆయన సంఘాన్ని నిర్మించడం కూడా. ఇది సైనోడాలిటీ యొక్క సారాంశం—*"కలిసి మార్గంలో నడవడం"* (syn + odos). సంఘం ఒంటరిగా నడవడానికి కాదు; కలిసి ప్రయాణించడానికి ఏర్పాటైనది. ఏ క్రైస్తవుడూ ఒంటరిగా నడవడానికి పిలువబడలేదు.

## 2. "మారుమనస్సు పొందండి; పరలోక రాజ్యం సమీపించింది"

యేసు సందేశం సులభమైనదే కానీ ఎంతో సవాలుతో కూడుకున్నది:
"పరలోక రాజ్యం సమీపించింది.  మారుమనస్సు పొందండి;"

యేసు తన బోధనల ద్వారా, ఉపమానాల ద్వారా, తన శిష్యులను పంపడం ద్వారా ఎల్లప్పుడూ ఈ రాజ్యాన్ని ప్రకటిస్తూనే ఉన్నాడు.
అయితే "పరలోక రాజ్యం" అంటే ఏమిటి? దాని అర్థం—దేవుని రాజ్యాధికారం, దేవుని పాలన. యేసు ఇలా చెబుతున్నాడు: "ఇప్పుడు దేవుడు రాజ్యము చేస్తున్నాడు."

ఇశ్రాయేలు ప్రజలకు ఇది విప్లవాత్మకమైన సందేశం. శతాబ్దాలుగా వారు నిర్వాసనం, ఆక్రమణ, నష్టం అనుభవించారు. దేవుని పాలన దూరంగా అనిపించింది. కానీ యేసులో అది స్పష్టంగా కనిపించింది—తండ్రికి సంపూర్ణ విధేయత, అద్భుత స్వస్థతలు, జీవితం మరియు ఆశ పునరుద్ధరణ.

దేవుని రాజ్యంలో పాతుకుపోయిన క్రైస్తవ జీవితం ఎప్పుడూ నిరుత్సాహంగా ఉండదు. అది ఉత్సాహభరితమైనది, జీవంతో నిండినది. కాబట్టి మారుమనస్సు అంటే కేవలం పాపాలు ఒప్పుకోవడం కాదు; అది మనకేంద్రీయ జీవితం నుంచి దేవకేంద్రీయ జీవితం వైపు తిరగడం.

### 3. బాధపడుతున్న భూలోక వాసులకు రక్షణ

యెషయా ప్రవక్త జెబులూను, నఫ్తాలీ ప్రాంతాలను “అంధకారంలో నెలకొన్న భూమి” గా పేర్కొన్నాడు. అదే ప్రాంతంలో యేసు తన సేవను ప్రారంభించాడు. ప్రజలు బాధపడుతున్న చోటే ఆయన అడుగుపెడతాడు. జీవితం చీకటిగా అనిపించే చోటే ఆయన వెలుగును తీసుకొస్తాడు.

ముగ్గురు జ్ఞానులు బాల యేసువైపు నడిపించబడిన నక్షత్రంలా, యేసు ప్రజలను వెలుగులోకి నడిపిస్తాడు.
మారుమనస్సు అనేది ఈ రక్షణను అనుభవించినప్పుడు సహజంగా పుడుతుంది. బప్తిస్మ **యోహానులా** యేసు శిక్షలు విధించడు; ఆయన విశ్వాసాన్ని, తనను

అనుసరించాలనే సం**సిద్ధతను** కోరుకుంటాడు. ఆయన సాన్నిధ్యం నిరాశను

ఆశగా, భయాన్ని ధైర్యంగా, పాపాన్ని క్షమగా మార్చుతుంది.

పేతురు, అంద్రేయ, యాకోబు, యోహాను—మొదటి శిష్యుల పిలుపు దీనికి ఉదాహరణ. వారు వెంటనే తమ వలలను, రోజువారీ పనులను వదిలి యేసును

అనుసరించారు. శిష్యత్వం అంటే తక్షణ స్పందన, నిబద్ధత, నమ్మకం అవసరం అని ఇది నేర్పుతుంది.

## 4. సంఘానికి పౌలు ఇచ్చిన తక్షణ హెచ్చరిక

కోరింథీయులకు వ్రాసిన లేఖలో, అపొస్తలుడు పౌలు ఒక ముఖ్యమైన సత్యాన్ని గుర్తుచేస్తాడు: క్రీస్తును విడగొట్టలేం.
అతను లేని సమయంలో సంఘంలో విభేదాలు, వర్గాలు ఏర్పడ్డాయి. ఈ రోజూ మన మానవ స్వభావం, సంస్థాగత సమస్యలు మనలను విడగొట్టవచ్చు. కానీ పౌలు స్పష్టంగా చెబుతున్నాడు—మన ప్రమాణం ఎప్పుడూ యేసు క్రీస్తే, ఆయన సువార్తే. వ్యక్తిగత గౌరవం కాదు, ఆశయం కాదు.

వివాదాలు, చర్చలు ఉన్నా కూడా, మన దృష్టి దేవుని రాజ్యంపైనే ఉండాలి. శిష్యత్వం అంటే మానవ పథకాలపై కాదు; క్రీస్తుపై విశ్వాసంతో నిలబడడం.

## 5. ఆరంభంలోని శక్తి

హెర్మాన్ హెస్సే ఇలా వ్రాశాడు:
"ప్రతి ఆరంభంలో ఒక మాయ ఉంది; అది మనలను కాపాడుతుంది, జీవించేందుకు సహాయపడుతుంది."

యేసు తన ప్రజా సేవను సిద్ధాంతంతో కాదు; సంబంధంతో ప్రారంభించాడు. సాధారణ మత్స్యకారులను పిలిచి ఇలా అన్నాడు: "మీరు ఏదైనా చేయగలరు. మీరు ఒంటరివారు కాదు."
శిష్యుల పిలుపు మనకు ఇది గుర్తు చేస్తుంది—విశ్వాసం ఎప్పుడూ సంబంధాల్లోనే మొదలవుతుంది. యేసును నమ్మడం, అలాగే మనతో కలిసి నడిచే వారిని నమ్మడం.

వల చేపలను కలిపి ఉంచినట్లే, సంఘంలో కలిసివుండటం అత్యవసరం. సంఘం లేకుండా క్రైస్తవ జీవితం అసంపూర్ణం. కలిసి ఉన్నప్పుడు మనం బలంగా, ఫలవంతంగా దేవుని వెలుగును పంచగలుగుతాం.

## 6. వలలు వేయడం

సర్కస్ బాలుడు తెలియని దూకుడు తీసుకున్నట్లే, మనమూ విశ్వాసంతో ముందుకు అడుగుపెట్టాలి. యేసు సాధారణ మనుషులను అసాధారణ కార్యానికి పిలుస్తాడు—ఆత్మీయంగాను, ప్రాయోగికంగాను ప్రాణాలను రక్షించే వలగా మారమని.

ఆయన మనలను ఒంటరిగా పంపడు. ఆయనను అనుసరించినప్పుడు, సంఘమే ఆ వలగా మారుతుంది—నిరాశలో పడిపోతున్న వారిని పట్టుకునే వలగా.

మన సంఘాలు, మన పరిషత్తులు, పరస్పర సహాయం—ఇవన్నీ ప్రాణాలను కాపాడే వలలే. ప్రతి విశ్వాస కార్యం, ప్రతి దయ కార్యం, ప్రతి ప్రార్థన ఆ వలలోని ఒక దారమే.

## 7. జెబులూను మరియు నఫ్తాలీ: నేటి పాఠం

జీవితంలో విజయం సాధించాలంటే అంచుల్ని వదిలి అధికార కేంద్రాలకు వెళ్లాలనే భావన ఉంటుంది. కానీ యేసు "సరియైన స్థలం", "సరియైన ప్రజల్నిఎంచుకోలేదు. "అసాధ్యమైన కార్యాన్నే", ఎంచుకున్నాడు. అంధకారంలోనే ఆయన వెలుగును ప్రారంభించాడు.

అలాగే మనమూ మన జీవితాల్లో—మరిచిపోయిన ప్రాంతాల్లో, నిర్లక్ష్యమైన కుటుంబాల్లో, పట్టించుకోని పనిస్థలాల్లో—వెలుగుగా ఉండమని పిలువబడుతున్నాం. దేవుడు ఎవరినైనా ఉపయోగించగలడు. మారుమనస్సు మరియు ఆయనను అనుసరించడం సాధారణ జీవితాలను దేవుని మహిమకు సాధనాలుగా మారుస్తాయి.

## 8. అంధకారం మరియు వెలుగు

అంధకారం అనేక రూపాల్లో వస్తుంది—మరణం, వ్యాధి, వ్యసనం, నిరాశ. కానీ యేసు క్రీస్తులో ప్రతి నీడలోనూ వెలుగు ప్రకాశిస్తుంది. ఆయన స్వస్థత ఇస్తాడు, క్షమిస్తాడు, పునరుద్ధరిస్తాడు.

బాప్తిస్మంలో మనం ఈ వెలుగును స్వీకరించాము. ఇప్పుడు దాన్ని పంచాల్సిన బాధ్యత మనదే. యేసును అనుసరించినప్పుడు, మనం ఆయన వెలుగును ప్రపంచంలోకి తీసుకెళ్తాం. శిష్యులు వలలను వదిలి ముందుకు వెళ్లినట్లే, మనమూ ఆయన శక్తిపై, సంఘ సహాయంపై నమ్మకం ఉంచి ముందుకు సాగుతాం. మనం ఎప్పుడూ ఒంటరివారు కాదు.

## 9. పిలుపు (Vocation): ఈ రోజూ వినిపిస్తున్న స్వరం

వ్యక్తి యొక్క పిలుపు కేవలం వృత్తి మాత్రమే కాదు; అది దేవుని ఆహ్వానం. గలిలేయ మత్స్యకారులను పిలిచినట్లే, ఈ రోజు యేసు ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను, విద్యార్థులను, కార్మికులను—స్పందించడానికి సిద్ధంగా ఉన్న ప్రతి ఒక్కరినీ పిలుస్తున్నాడు.

మదర్ తెరిసా కలకత్తాలో మరణిస్తున్న వారి అరుపుల్లో యేసు పిలుపును విన్నారు. ఈ రోజూ ఆయన పరిస్థితుల ద్వారా, వ్యక్తుల ద్వారా, అవసరాల ద్వారా పిలుస్తూనే ఉన్నాడు. మనం వినాలి, స్పందించాలి, పాత వలలను వదిలి ముందుకు అడుగుపెట్టాలి.

పిలుపు నిరంతరం కొనసాగుతుంది. రూపాలు మారవచ్చు; కానీ పిలుపు మారదు. ప్రతి సేవ, ప్రతి ప్రార్థన, ప్రతి విశ్వాసపూర్వక చర్య దేవుని రాజ్యాన్ని ఈ భూమిపై నిర్మిస్తుంది.

ఇప్పుడు మళ్లీ ఆ సర్కస్ బాలుడి కథకు వస్తాం. అతని దూకుడు భయంకరమైనది. అతను దాదాపు పడిపోయాడు. కానీ తండ్రి వేసిన వల అతన్ని సురక్షితంగా పట్టుకుంది.

ఈ రోజు దేవుడు మనలను సేవలోకి, శిష్యత్వంలోకి, తన రాజ్య వెలుగులోకి దూకమని పిలుస్తున్నాడు. మనం తడబడవచ్చు; మనకు అర్హతలేదనిపించవచ్చు. కానీ సంఘం, ప్రేమ, విశ్వాసంతో నేయబడిన యేసు వల మనల్ని పట్టుకుంటుంది.

ధైర్యం తెచ్చుకుందాం. మారుమనస్సు పొందుదాం. ఆయనను అనుసరిద్దాం. కలిసి పనిచేద్దాం. అంధకారంలో దేవుని వెలుగును ప్రసరింపజేద్దాం.
దశ దశలుగా, ప్రతి కొత్త ఆరంభంతో, ఆయన రాజ్యం మన ద్వారా ప్రకాశిస్తుంది.
ఆమేన్.

**Translated by: Rev. Fr. Francis Theetla, Parish Priest of Paidikaluva, Cuddapah.**